ప్రజాశక్తి

మంగళవారం 25 జులై 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

వాన్‌పిక్ భూములను రైతులకిచ్చి..

నిజాయతీ నిరూపించుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



రైతులతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

వాన్‌పిక్ భూకుంభకోణంలో తాను నిజాయితీపరుడనని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులకు భూములు తిరిగి ఇచ్చి తన నిజాయతీని నిరూపించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వాన్‌పిక్ భూములను ఇడి అటాచ్‌మెంట్ నుండి తెలంగాణ కోర్టు మినహాయింపు ఇచ్చిన నేపథ్యంలో ఆయన సోమవారం చినగంజాం మండలంలోని వాన్‌పిక్ భూసేకరణ గ్రామాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతుల నుండి తీసుకున్న భూమిని వాన్‌పిక్ సంస్థ వాళ్లు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.870 కోట్ల రుణాలు కూడా పొందారని చెప్పారు. గడిచిన 15 ఏళ్లలో రైతులు భూములు కోల్పోయి, ప్రభుత్వం నుండి రాయితీలు రాక సుమారు రూ.1800 కోట్లు నష్టపోయారని చెప్పారు. ఇలా రైతులను మోసం చేశారని అన్నారు. 15 ఏళ్లలో వాన్‌పిక్ భూసేకరణ ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. వాన్‌పిక్ అవినీతితో తనకు సంబంధం లేదని ఈ కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న ముఖ్యమంత్రి జగన్ వాన్‌పిక్ భూములను తిరిగి రైతులకు ఇచ్చి తన నిజాయతీని నిరూపించుకోవాలని అన్నారు. మీడియా సమావేశంలో సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, చీరాల కార్యదర్శి ఎన్.బాబూరావు, వాన్‌పిక్ పోరాట కమిటీ కన్వీనర్ పి.కొండయ్య, చిన్నగంజాం సిపిఎం కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్, సిపిఎం నాయకులు ఎం వసంతరావు, వాన్‌పిక్ భూముల పోరాట కన్వీనర్ పంప్రాజు శంకర్ పాల్గొన్నారు.



చీమకుర్తి బహిరంగ సభలో మాట్లాడుతున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటాం..

- కలెక్షన్‌బాబుగా పేరొందిన ఎమ్మెల్యే
- ఏ ఒక్క హామీని అమలు చేయని జగన్
- చీమకుర్తి బహిరంగ సభలో లోకేష్



బహిరంగ సభలో లోకేష్, విజయ్‌కుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

2024 ఎన్నికలలో అధికారంలో వచ్చిన వెంటనే గ్రానైట్ పరిశ్రమ సమస్యలన్నీ పరిష్కరిస్తామని, గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా చీమకుర్తి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి.. గెలిచాక అవినీతిలో దిట్టగా నిలిచారని విమర్శించారు. వైసిపి నాయకులే ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబుకు ▶ 2లో

భర్త, పిల్లలను చంపుతానని..

దళిత మహిళపై అత్యాచారం

- అడ్డుకున్నందుకు హత్యాయత్నం
- లారీడ్రైవర్ దాష్టీకం
- ఎస్‌పి ఆదేశాలతో కేసు నమోదు

ప్రజాశక్తి-బేస్తవారిపేట

పిల్లలను, భర్తను చంపుతానని ఓ దళిత మహిళపై ఓ లారీడ్రైవర్ కొన్నాళ్లుగా అత్యాచారం చేస్తున్నాడు. ఇటీవల ఆమె ప్రతిఘటించడంతో ఆమె తల పగలగొట్టాడు. బాధితురాలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. దళిత నాయకులు ఎస్‌పికి ఫిర్యాదు చేయడంతో ఎస్‌పి ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

బాధితురాలి కథనం ప్రకారం.. బేస్తవారిపేట మండలం, అక్కపల్లికి చెందిన దళిత మహిళ జక్కం మరియమ్మ స్థానిక ఇళ్లల్లో పాచిపని చేస్తూ బతుకుతోంది. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు. భర్త చంటయ్య స్థానికంగా ఉన్న ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తుంటాడు. బీసీ సామాజికవర్గానికి చెందిన అదే గ్రామానికి చెందిన కోరాకుల గంగరాజు అనే లారీడ్రైవర్ చాలా కాలంగా మరియమ్మ పిల్లలను, భర్తను చంపుతానంటూ.. ఆమెపై అత్యాచారం చేస్తున్నాడు. అతని హింసను తట్టుకోలేని మరియమ్మ ఇటీవల ప్రతిఘటించింది. తమ ఇంటికి రావొద్దని గట్టిగా చెప్పింది. భర్త, బిడ్డలతో కలిసి బీసీ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు చేరింది. గంగరాజు ▶ 2లో



మొసలి దాడిలో గాయపడ్డ గేదె

కొమ్మమూరు కాలువలో

మొసలి.!

- గాయపడి.. తప్పించుకున్న గేదె
- భయాందోళన చెందుతున్న స్వర్ణ గ్రామస్తులు

▶ 5లో

గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటాం..

(మొదటిపేజీ తరువాయి)

కలెక్షన్ బాబుగా పేరు పెట్టారన్నారు. ప్రతి అంశంలో వాటాలు వసూలు చేస్తూ పేరు సార్థకం చేసుకున్నారన్నారు. చిల్లరకొట్టు నుంచి చీమకుర్తి గ్రానైట్ వరకు కలెక్షన్ బాదుడే బాదుడే అని విమర్శించారు. స్థలాలను రైతుల నుంచి తక్కువకు కొని ప్రభుత్వానికి ఎక్కువ రేటుకు అమ్మాడని పేర్కొన్నారు. సెంటు స్థలాలలో కలెక్షన్‌బాబు వాటా రూ.50 కోట్లని పేర్కొన్నారు. గుండ్లకమ్మలో ఇసుకను దోచేసి రూ.కోట్ల సంపాదన వెనుకేశారన్నారు. అక్రమ మైనింగ్, గ్రావెల్ దందాలో దిట్టగా పేరొందారన్నారు. సొంత పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కూడా కప్పం కడితేనే పనులయ్యే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల నుంచి కప్పాలు వసూలు చేయడంలో రాటుదేలారన్నారు.

గ్రానైట్ యజమానులను ఆదుకుంటాం..

వైసిపి హయాంలో గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో పడిందని లోకేష్ అన్నారు. కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని, రాయల్టీ తగ్గిస్తామని ఎన్నికల హామీలు ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి.. వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, గ్రానైట్ రాయల్టీని తగ్గిస్తామని, యజమానులను ఆదుకుంటామని పేర్కొన్నారు. చీమకుర్తి ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రి కట్టిస్తానని జగన్ హామీ ఇచ్చి.. చీమకుర్తి ప్రాంత ప్రజలను మోసం చేశారని చెప్పారు. టన్నుకు రూ.5000 ఇస్తానని హామీ ఇచ్చారని, ఏఎంసీల ద్వారా కర్ర కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల తర్వాత రైతులను మోసం చేశారని విమర్శించారు. టిడిపి అధికారంలో వచ్చాక సుబాబుల్ రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలోని రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టులను అభివద్ధి చేస్తామని తెలిపారు.

ఒంగోలు డెయిరీని ప్రారంభిస్తాం

ఒంగోలు డెయిరీని ప్రారంభిస్తామని, గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద కీర్తిపాడు, ఉప్పలపాడు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చీమకుర్తి మున్సిపాలిటీలో ప్రతి ఇంటికీ వాటర్ గ్రిడ్ పథకం ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని, అవినీతి జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్యే డోలా వీరాంజనేయస్వామి, కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే పాపారావు, మాజీ ఎంపీ శ్రీరామ్ మాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

జాషువాకు ఘన నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గుర్రం జాషువా వర్ధంతి వేడుకలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ కవి జాషువా సాహిత్య రచనా ఆరంభంలో సాటి పండితలోకం నుంచి అనేక అవహేళనలు ఎదుర్కొంటూ కూడా తన కలానికి పదునుపెట్టి నాటి సమాజంలో నెలకొన్న కుల మతాల్లోని అనేక రుగ్మతలపై తన కలం ద్వారా చైతన్యం తీసుకొచ్చారని కొనియాడారు. గబ్బిలం, ఫిరదౌసి లాంటి ఎన్నో గొప్ప రచనలతో సాహితీ జగత్తుతో నవయుగ కవి చక్రవర్తిగా, కవి కోకిలగా, పద్మభూషణ్‌గా ఎన్నో బిరుదులు, సన్మానాలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘి క సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, దర్శి మాజీ శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు సెంటర్‌లో..

విశ్వకవి గుర్రం జాషువా 53వ వర్ధంతి వేడుకలు యర్రగొండపాలెంలోని బస్టాండ్ సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ వలి, కో ఆప్షన్ సభ్యుడు విజయభాస్కర్, నాలుగో తరగతి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఆలేటి నాగయ్య, బూదాల చిన్నయ్య, మాండ్ల సుబ్బయ్య, రాంబాబు, చేదూరి రవి, పిసిహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: గుర్రం జాషువా 53వ వర్ధంతిని పురస్కరించుకొని కనిగిరి పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ సమీపంలోగల గుర్రం జాషువా విగ్రహానికి కనిగిరి నియోజకరవ్గ మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, తమ్మినేని వెంకటరెడ్డి, చింతలపూడి తిరుపాలు, ముచ్చుమారి చెంచిరెడ్డి, రాచమళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా బాపట్ల పార్లమెంటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆధ్వర్యంలో బాపట్ల ఏబీఎం హైస్కూల్ ఎదురుగా ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. సామాజిక రుగ్మతలను రూపుమాపే విధంగా అద్భుతమైన రచనలు చేసిన



గుర్రం జాషువాకు నివాళి అర్పిస్తున్న మంత్రి సురేష్

మహాకవి గుర్రం జాషువా ఆదర్శప్రాయుడని పలువురు పార్టీ నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవరాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు పఠాన్ రాజేష్, శంకర్‌రెడ్డి, కట్టా లాజరస్, చింతా బాబురావు, శీలం సాగర్, దోనేపూడి రవి, సాధు హెర్బర్ట్, ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

మేదరమెట్ల: గుర్రం జాషువా 53వ వర్ధంతిని ఘనంగా మేదరమెట్లలో యుటిఎఫ్ ఆఫీసులో సోమవారం జరిపారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ ఆ రోజులలోనే సమానత్వం కోసం పోరాడిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ సర్దార్ ఖాన్, పులిపాటి వీరయ్య, పేరం సతీష్, తేళ్ల శ్రీనివాసరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

అద్దంకి: రోటరీ క్లబ్ అఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా, పట్టణంలోని పసుమర్తిపాలెంలో జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జాషువా తన ఖండ కావ్యములతో ఆనాటి సమాజంలోని రుగ్మతలపై కొరడా ఝుళిపించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారంతో గౌరవించినదని పేర్కొన్నారు. రోటరీ ప్రెసిడెంట్ చిన్ని మురళీకృష్ణ, కార్యదర్శి చప్పిడి వీరయ్య, అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, రోటరీ సభ్యులు డాక్టర్ ఉబ్బా దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, మలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, జాషువా కళా సాహిత్య వేదిక అధ్యక్షులు పిసిహెచ్ కోటయ్య, చుండూరి మురళీ సుధాకరావు, సిపిఐ నాయకులు కెఎల్‌డి ప్రసాద్, సగ్గం అంజయ్య, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

దళిత మహిళపై అత్యాచారం

(మొదటిపేజీ తరువాయి)

మరియమ్మ ఇల్లు కనుక్కొని వచ్చి.. ఆమెపై మళ్లీ అత్యాచారానికి యత్నించాడు. అడ్డుకున్న మరియమ్మను కర్రతో తల పగలగొట్టాడు. అడ్డుచ్చిన ఆమె బావ యేసయ్య చెయ్యి విరగ్గొట్టాడు. దీనిపై బాధితురాలు బేస్తవారిపేట ఎస్ఐ మాధవరావుకు ఫిర్యాదు చేయగా.. ఆయన కేసు నమోదు చేయలేదు. దీంతో దళిత హక్కుల సంఘం నాయకులు నీలం నాగేంద్రను కలిసి సమస్యను చెప్పగా.. ఆయన ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఎస్ఐ నిందితుడు గంగరాజుపై అత్యాచారం, హత్యాయత్నం కేసు నమోదు (క్రైమ్ నెంబర్ 140/23) చేశారు. కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరియమ్మకు ఎస్పీ మల్లికా గార్గ్ ఫోన్ చేసి అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

మతోన్మాదుల పాలనకు చరమగీతం పాడాల్సిందే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మతోన్మాదులు పాలిస్తున్న కేంద్ర రాష్ట్రాల్లో సామాన్యులకు, బడుగు బలహీన, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ముఖ్యంగా ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందని, ఈ మతోన్మాదుల పాలనకు చరమగీతం పాడాలని ప్రజా సంఘాల నాయకులు డి సోమయ్య, అందె నాసరయ్య, షేక్ అబ్దుల్ రజాక్, జానముల నాగయ్య అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న అమానుష అఘాయిత్యాలను ఆపాలని, మణిపూర్‌లో హత్యాచార మారణకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక కోర్టు కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మణిపూర్ ఘటన దేశాన్ని కలచివేసినా, ప్రధానమంత్రి నరేంద్రమోడీ మౌనం వీడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. మహిళల పట్ల బిజెపి ప్రభుత్వ వైఖరి అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగి 70 రోజులు గడుస్తున్నా కనీసం ప్రధానమంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రతిపక్షాలు ఎంత మొరపెట్టుకున్నా తనకు సంబంధం లేనట్లుగా దేశ ప్రధాని ఉన్నారన్నారు. మహిళల భద్రతా పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో ఇంటర్నెట్ లేకుండా చేయడం, అక్కడ జరుగుతున్న ఘోరాలను బయటకు తెలియకుండా నిందితులకు సపోర్ట్ చేయడం బిజెపి ప్రభుత్వానికి చెల్లుతుందన్నారు. రక్షణ కల్పించాల్సిన పాలకులు మౌనం పాటిస్తున్నారని, జాతుల మధ్యచిచ్చుపెట్టి రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మార్కాపురం ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి ఎం బాలాజీ నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ రసూల్, జిల్లా అధ్యక్షులు షేక్ ఖాశిం, ఐజేయు రాష్ట్ర నాయకులు ఎన్‌వి రమణ, జమాఅతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షులు సికిందర్, సిపిఐ నాయకులు అందె నాసరయ్య, ఖాశిం, సిపిఎం నాయకులు రఫీ, రాజు, నన్నేసా, ఇమామ్‌సా, బహుజన సైన్యం నాయకులు చిన్నబాబు, రాజు, వలి తిమోతి, సుబ్బయ్య, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంద్రపాటి కాలేబు, దళిత నాయకులు చిట్టిబాబు, ఐవైఎం రాష్ట్ర సలహా మండలి సభ్యులు ఇస్మాయిల్, పట్టణ అధ్యక్షుడు అబూబకర్, దళిత మహిళా నాయకురాలు రోజ్ లిడియా, ముస్లిం హక్కుల పోరాట సమితి మహిళా నాయకురాలు భాను, ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, ఎస్టీపీఐ జిల్లా అధ్యక్షులు సత్తార్ తదితరులు పాల్గొన్నారు.



ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టిన ప్రజాసంఘాల నాయకులు



దొనకొండలో సిపిఎం శ్రేణుల నిరసన

దొనకొండ: దళిత క్రైస్తవులపై మణిపూర్ రాష్ట్రంలో జరిగిన హింసాత్మక సంఘటనలు, అఘాయిత్యాలను ఖండిస్తూ సిపిఎం మండల కమిటీ నేతృత్వంలో సోమవారం దొనకొండ పురవీధుల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల సిపిఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో క్రిస్టియన్లపై మతోన్మాదులు రెచ్చిపోయి 357 చర్చీలను ధ్వంసం చేసి మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి, సామూహిక అత్యాచారం చేయటాన్ని ఆయన ఖండించారు. దళిత క్రైస్తవులకు రక్షణ కల్పించలేని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు ఈ సంఘటనలకు బాధ్యత వహించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. అనంతరం నినాదాలు చేస్తూ పురవీధుల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు కె అనీల్, కె చిన్ననర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, ఎం అంజిబాబు, బండారు శ్రీకాంత్, కరవది రామయ్య, బాలరాజు, ఏసుదాసు, సంతోష్‌కుమార్ మరికొందరు పాల్గొన్నారు.

రాగి, ఇత్తడి సామాన్ల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రాగి, ఇత్తడి సామాన్ల దొంగను ఇంకొల్లు పోలీసులు అరెస్టు చేశారు. ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ అందించిన వివరాల ప్రకారం.. పూనూరు గ్రామానికి చెందిన దార్ల ఇశ్రాయేలు, దార్ల వెంకటమ్మ, షేక్ హుస్సేన్, వలపర్ల గ్రామానికి చెందిన షేక్ హుసేన్‌లు పర్చూరు రోడ్డులో తటస్తపడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఎవరూ లేని ఇళ్లలో రాగి, ఇత్తడి వస్తువులు దొంగతనం చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. సుమారు రూ.60 వేలు విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నాయబ్ రసూల్ వివరించారు.

35 మందికి కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి భాస్కర్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి వెలుగు ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని 35 మందికి కంటి ఇబ్బందులు గుర్తించి వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్, ఆప్తాల్ అసిస్టెంట్ కవిత, హెడ్ నర్సు ఎలిజిబెత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకట రమణయ్యకు నివాళి

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో సోమవారం గ్రంథ పాలకులు బాదం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు స్వర్గీయ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలకు వెంకటరమణయ్య అందజేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-భట్టిప్రోలు (అమృతలూరు)

ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలకు అమృతలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిపి రావర్ల నరేంద్ర కుమార్ తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అందరు ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు. సాధారణ పాలనాపరమైన అంశాలు ఎజెండాగా ఉంటాయని చెప్పారు.

హెచ్‌ఐవి బాలలకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనంలో పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో హెచ్‌ఐవి సోకిన బాలబాలికలకు 18 రకాల ఆహార పదార్థాలు డాక్టర్ సలహా మేరకు అందజేశారు. డాక్టర్ జె సౌమ్య శ్రీదేవి మాట్లాడుతూ వ్యాధి సోకిన బాధితులు తరచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైరల్ లోడును అదుపులో ఉంచుకుంటూ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడుకుంటూ ఉండాలని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో రోటరీ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లకు ఆసుపత్రి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు కోట శ్రీనివాసరావు, పాపోలు వెంకన్న, మున్నంగి వెంకటసుబ్బయ్య, దండా శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, సిబ్బంది ఎస్కే షంషేర్, అంజలి, బాధితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'సురక్ష'తో లబ్ధి పొందాలి

ప్రజాశక్తి-వేటపాలెం

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ ఎడి కృష్ణ కిషోర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేశాయిపేట సచివాలయం-3 లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 350 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, డిటి, పంచాయితీ ఇఒ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాలలోని ఆర్‌బికె స్టాఫ్, వ్యవసాయ సిబ్బందికి ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సాగు సన్నాహాలపై ఏడిఏ ఎన్ మోహనరావు శిక్షణ ఇచ్చారు. ఆర్‌బికె సిబ్బంది విధిగా కౌలు రైతులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామంలో 60 నుంచి 70 మంది కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది, విఆర్‌ఓలు కలసి తమ రెవెన్యూ పరిధిలోని ప్రతి కౌలు రైతును కలిసి, లాండ్ ఓనర్ రైతులను కలసి వారికి అవేర్నెస్ కల్పించాలని చెప్పారు. పర్చూరు మండలానికి 3,036, ఇంకొల్లు మండలానికి 2,873, కారంచేడు మండలానికి 3,525, యద్దనపూడి మండలానికి 2,545 చేయాలని తెలిపారు. రాబోయే ఖరీఫ్ 2023కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్‌పై అవగాహన చేసుకుని తప్పులు జరగకుండా చేయాలని తెలిపారు. సమావేశంలో సమరనాథ్, ఇంకొల్లు ఏఓ వేణుగోపాల్, కారంచేడు ఏఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



పర్చూరులో మాట్లాడుతున్న ఏడిఏ మోహన్‌రావు

ఎత్తిపోతల పథకాన్ని సాధించుకుందాం

ప్రజాశక్తి-మేదరమెట్ల

కొరిసపాడులో ఉన్న ఎర్రం చిన్న పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం పనులపై ఎత్తిపోతల సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రావినూతల గ్రామంలో సొసైటీలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు సమావేశమయ్యారు. అనంతరం కొన్ని తీర్మానాలను చేసుకున్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో కలిసి జిల్లా కలెక్టరుకు ఒక మెమోరం ఇవ్వడం అదే విధంగా టిడిపి జాతీయ నాయకుడు పాదయాత్రలో లోకేష్‌కు, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి, అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృష్ణ చైతన్యకు వినతిపత్రాలు ఇచ్చి చిన్న పోలిరెడ్డి ప్రాజెక్టును ఎలాగైన సాధించుకోవాలని తీర్మానించారు. బడ్జెట్‌ను కేటాయించి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని రైతుల డిమాండ్ చేశారు. పోరాడి ఎత్తిపోతల పథకాన్ని సాధించుకుందామని తీర్మానించారు. ఈ కార్యక్రమానికి అందరు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల పథక సాధన కమిటీ కన్వీనర్ నాతాని హనుమంతరావు, ముఖ్య అతిథిగా జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు, లేళ్ల సుబ్బారెడ్డి, కొల్లా సుబ్బారావు, బాలినేని వీరయ్య, ఎర్రమాసు సుధాకర్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అరెస్ట్.. ఇద్దరి కోసం గాలింపు..

రైల్వే చార్టులో పేర్లు ఆధారంగా పట్టుబడ్డ అక్రమ మద్యం

ప్రజాశక్తి-బాపట్ల

గోవా నుంచి బాపట్లకు తరలిస్తున్న రూ.70 వేల అక్రమ మద్యాన్ని బాపట్ల సెబ్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల సెబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెబ్ డిప్యూటీ సూపరింటెండెంట్ నరసింహారావు స్వాధీనం చేసుకున్న గోవా మద్యం వివరాలను వెల్లడించారు. గోవా మద్యాన్ని తిరువనంతపురం నుంచి రైలులో బాపట్లకు తరలిస్తున్న మెన్షన్ హౌస్ 36 ఫుల్ బాటిల్స్, 258 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం తరలిస్తున్న స్టువర్ట్‌పురానికి చెందిన వల్లభ ఝాన్సీని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమెతోపాటు మద్యం తరలిస్తున్న బోగిరి సురేష్, ఉయ్యాల చంటి పరారయ్యారు. తిరువనంతపురం నుంచి శబరి ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తున్న గోవా మద్యాన్ని రైల్వే రిజర్వేషన్ చార్ట్‌లో ఉన్న పేర్ల ఆధారంగా వలపన్ని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. స్టువర్టుపురం ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి దాదాపుగా నాటు సారా తయారీని నిర్మూలించడంతో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా బాపట్ల ప్రాంతానికి తరలించి అక్కడి ధరల కంటే దాదాపు మూడు రెట్లు అధికంగా ఇక్కడ అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోందని చెప్పారు. కాపుసారా తయారీ దారులను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించినప్పటికీ పలువురు అడ్డదారుల్లో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యాన్ని తరలిస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై నిఘా తీవ్రతరం చేశామన్నారు. సమావేశంలో బాపట్ల సెబ్ సిఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద ఓపెన్ జిమ్

రూ.1.63 కోట్ల 'ఒడా' నిధులతో శరవేగంగా పనులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద కొత్త సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ (ఒడా) నిధులు రూ.1.63 కోట్లు కేటాయించారు. సోలార్ లైటింగ్, అవెన్యూ ప్లాంటేషన్, వాకింగ్ ట్రాక్, యోగా ప్లాట్ ఫాం, ఓపెన్ జిమ్‌ను నిర్మించనున్నారు. వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసి చెరువు చుట్టూ మొక్కలు నాటి బ్యూటిఫికేషన్ చేయనున్నారు. నగరంలో రంగరాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ తరువాత వాకర్స్ ఎక్కువగా వాకింగ్ కోసం వెళ్లేది ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకే. అయితే ఇక్కడ సౌకర్యాలు అంతగా లేవు. కనీసం మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. కరెంటు సదుపాయం లేదు. దీంతో వాకింగ్‌కి వచ్చేవారికి కొంత అసౌకర్యంగానే ఉంటుంది. సాయంత్రం ఆరు గంటలకే కట్ట ఖాళీ చేయాల్సిన పరిస్థితి. ఈనేపథ్యంలో మొత్తం ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద పలు సౌకర్యాలు కల్పించేందుకు ఒడా సంస్థ ముందుకు వచ్చింది. వారి నిధులతో అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం కూడా తీసుకున్నారు. దీంతో ఇటీవల ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేత శంకుస్థాపన పనులు చేయించారు. ప్రస్తుతం ఓపెన్ జిమ్, యోగా ప్లాట్ ఫాం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొక్కలు నాటే ప్రక్రియ కూడా మొదలు పెట్టారు. కట్టకు దిగువన వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇది చూసిన వాకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద కూడా ఇదే విధంగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఒడా సంస్థ ఉన్నట్లు సమాచారం.



వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న సమితి ప్రతినిధులు

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని కోటయ్య అనాథ వృద్ధాశ్రమాలయానికి గుంటూరుకు చెందిన శంభూప్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, వస్తువులు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా చీరాల కోటయ్య వృద్ధ శరణాలయం అందజేస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి శంభు ప్రియ సేవా సంస్థ ద్వారా అవసరమైన సామగ్రి, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో శంభుప్రియా సేవా సమితి చీరాలతో పాటు గుంటూరు జిల్లాలో అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పేదవారికి సాయం అందించడంలోనే నిజమైన సంతృప్తి ఉంద ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సుగుణ, పద్మ, వెంకట సాయి, లక్ష్మి సింధు, ఇందిరాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-చీరాల

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈపూరిపాలెం, పద్మనాభునిపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రూ.4 వేల విలువగల నోట్ బుక్స్, జామెంటరీ బాక్సులను రోటరీ సభ్యుడు గుర్రం మోహనరావు ఆర్థిక సహకారంతో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ రోటరీ సేవా కార్యక్రమాల్లో అన్నివేళలా ముందు ఉంటుందని, అందులో భాగంగా విద్యార్థులకు చదువు సామగ్రిని పంపిణీ చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా స్కూల్లో వాలంటీర్‌గా పనిచేస్తున్న గుండపు కల్పన అనే మహిళకు రూ.3 వేల నగదు క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డివి సురేష్, బి హేమంత్ కుమార్, జివై ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కేశవస్వామి, వెంకటేశ్వర్లు, పద్మావతి, శోభారాణి, పలువురు పాల్గొన్నారు.

రామనాథం మృతికి ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

ప్రజాశక్తి-కారంచేడు

బాపట్ల జిల్లా కారంచేడు గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, గోరంట్ల రామనాథం మృతి పట్ల తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం నాడు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం చాలా బాధాకరమన్నారు. సామాజిక కార్యక్రమాలలో రామనాథం చేసిన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులు మనోధైర్యంగా ఉండాలని కోరారు.

గ్రంథాలయోద్యమ యోధుడు అయ్యంకికి నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకల సందర్భంగా బాపట్ల శాఖ గ్రంథాలయాధికారి ఎ శివాజీ గణేశన్ సోమవారం అయ్యంకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రంలో గ్రంథాలయాల ఏర్పాటుకు గ్రంథాలయోద్యమ పితామహుడిగా అయ్యంకి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయా రన్నారు. అయ్యంకి ఉద్యమ కృషి ఫలితమే ఎంతోమంది విద్యార్థులు, నిరుద్యోగులు, పుస్తక పఠనాభిలాషులు గ్రంథాలయాలను ఉపయోగించుకో గలుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులపై అవగాహన

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు తహశీల్దారు కార్యాలయంలో కౌలు రైతు కార్డులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇంకొల్లు మండల వ్యవసాయాధికారి నార్నె వేణుగోపాల్ సిబ్బందికి వివరించారు. పిఎం కిసాన్ కార్డులకు ఇకెవైసి చేయించాలని సూచించారు. సమావేశంలో తహశీల్దారు పి బ్రహ్మయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని..

బాపట్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-బాపట్ల

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం బాపట్ల పాత బస్టాండ్ వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాలను ఇవ్వకుండా, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. నాడు-నేడు పేరుతో విద్యా వ్యవస్థనే మార్చేస్తున్నాం అని చెప్పే పాలకులు విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా కళాశాలలో మౌలిక వసతులు కల్పించలేని ప్రభుత్వం విద్యా వ్యవస్థను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. పుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారు. గత ప్రభుత్వం పేద విద్యార్థులకు కడుపు నింపడం కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తే ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేసి విద్యార్థులు కడుపు కొట్టారని మండిపడ్డారు. వైసిపి అధికారంలోకి వస్తే జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య

అధికారంలోకి వచ్చాక ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోగా ఉన్న పోస్టులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెంటనే టీచింగ్, నాన్ టీచింగ్, ప్రిన్సిపల్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది ప్లస్ టు స్కూల్స్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అడ్మిషన్లు చేసి వారికి చదువు చెప్పేందుకు అధ్యాపకులు నియమించ లేదని ఫలితంగా ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్లస్-2 పాఠశాలల్లో పూర్తిగా విద్యార్థులు ఫెయిల్ అయ్యారన్నారు. ప్రభుత్వ విధానాలతో విద్యార్థుల జీవితాలు నాశనమౌతున్నా యని ప్రభుత్వాన్ని విమర్శించారు. అదేవిధంగా బాపట్ల, నిజాంపట్నం, చందోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బాపట్ల ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా క్రమంగా ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థులను దూరం చేసి, విద్యార్థులు లేరనే కారణంతో శాశ్వతంగా ప్రభుత్వ విద్యను అందించాలనే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించు కోవాలని చూస్తోందన్నారు. ఈ రోజు కేవలం పేద విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుకుంటున్నారు. వారికి విద్యను దూరం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అదేవిధంగా జైల్లో ఉండే ఖైదీల కంటే హీనంగా హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఐక్యం చేసి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమానికి సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మజుందార్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు రాజారాం, బహుజన సమాజ్ వాది పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరావు, జనసేన నాయకులు ఆదిశేషు, విద్యావేత్తలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ విభాగం కన్వీనర్ నాగలక్ష్మి, నాయకులు రవి, భానుతేజ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-నగరం

గ్రామాల్లో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడు తున్నా పంచాయతీ కార్య దర్శులు పట్టించుకోవడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అద్దంకివారిపాలెం, మంత్రిపాలెం, పెద్దవరం గ్రామాలకు సంబంధించిన వార్డు మెంబర్లు సోమవారం ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ప్రజలు మంచినీరు లేక, వీధి దీపాలు వెలగక అనేక ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదన్నారు. వారి పైన వెంటనే చర్యలు తీసుకోవాలని ఈరోజు నగరం ఎంపిడిఒను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నగరం మండలం అధ్యక్షుడు విచారపు వీరయ్య, మాజీ జడ్పిటిసి సభ్యులు మేకా శివరామకృష్ణ, అద్దంకివారిపాలెం గ్రామ సర్పంచ్ విచారపు పావని, మంత్రిపాలెం గ్రామ సర్పంచ్ ప్రమీల, పెద్దవరం గ్రామ సర్పంచ్ హరేరామ్, నగరం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు అర్జీ ఇస్తున్న ప్రజలు



మాట్లాడుతున్న ఎడిఎ శ్రీనివాస్

వాస్తవ సాగును గుర్తించాలి: ఎడిఎ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రైతు భరోసా కేంద్రం సిబ్బంది పైరు నమోదు చేసే సమయంలో వాస్తవ సాగును గుర్తించి పైరు నమోదు చేయాలని మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మార్టూరు సబ్ డివిజన్ పరిధిలోని సంతమాగులూరు, బల్లికురవ, జె పంగులూరు, మార్టూరు మండలాల పరిధిలోని రైతు భరోసా సిబ్బంది, వ్యవసాయాధికారులు, ఏఎస్ఓలకు స్థానిక కొణిదెన రోడ్డులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ.. పైరు నమోదు ఆధారంగానే రైతులకు ప్రభుత్వం అన్ని పథకాల్ని అందిస్తోందని, ఇన్సూరెన్స్, పంట నష్టం, ప్రభుత్వం ద్వారా పంట కొనుగోలు వంటి పథకాలన్నీ పైరు నమోదు ఆధారంగానే అమలు చేస్తారని, రైతు భరోసా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మార్టూరు వ్యవసాయాధికారి వీరగంధం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు జరుగుతున్నందున రైతు భరోసా కేంద్రం సిబ్బంది కౌలు రైతులను గుర్తించి అందరికీ సకాలంలో కౌలు రైతుల కార్డులను రెవెన్యూ శాఖ ద్వారా మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు లావణ్య, కుమారి, ఉద్యానశాఖాధికారి హనుమంత నాయక్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లలచెరువులో 'గడప గడపకూ'

ప్రజాశక్తి- సంతమాగులూరు

అన్ని వర్గాల ప్రజానీకం సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర శాప్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గం వైసీపీ పార్టీ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య తెలిపారు. సోమవారం మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో మొదటి రోజుగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.



'గడప గడపకూ'లో పాల్గొన్న కృష్ణ చైతన్య

ఈ కార్యక్రమానికి ముందుగా గ్రామ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులతో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసీపీ పార్టీ మండల కన్వీనర్ చింతా రామారావు, నాయకులు ఒరుగంటి కోటిరెడ్డి, నాగబోతు రామాంజనేయులు, అట్లా పెద్ద వెంకటరెడ్డి, దుద్దేల గాలెయ్య, మోదేపల్లి శ్రీనివాసరావు, పలువురు సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి గేదె మృతి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మండలంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఈనెల 15వ తేదీ శనివారం కంబాల పాడు చెందిన విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్ అలవాల వెంకట నారాయణ చనిపోయినా వారిలో నిర్లక్ష్యం వీడకపోగా తాజాగా మరో రెండు మూగజీవాలు మత్యువాత పడిన సంఘ టన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంబాల పాడు గ్రామ పొలాల్లో విద్యుత్ లైన్మెన్‌గా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద స్థితిలో వెంకట నారాయణ మృతి చెందాడు. ఇది జరిగిన తరువాత అక్కడికి సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ హెచ్‌టి లైన్ తీగలు తెగి పడిపోయాయి. అప్పట్లో వీటిని గుర్తించి సరి చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. 15వ తేదీ నారాయణ మృతి చెందగా గత శుక్రవారం వరకు విద్యుత్ సిబ్బంది కానీ అధికారులు కానీ ప్రమాదం జరిగిన ప్రాంతాల్లో పర్యటించలేదు. కాగా శుక్రవారం నందిపాలెం గ్రామానికి చెందిన గేదె ఒకటి పొలానికి వెళ్లగా రైతు దోర్నాల వెంకటేశ్వర్‌రెడ్డి దాని కోసం వెతుకుతున్నాడు. అప్పటికే పొలం వెళ్ళిన గేదె వెంకట నారాయణ మతి చెందిన ప్రాంతానికి సమీపంలో ట్రాన్స్ఫార్మర్ వద్ద కింద పడి ఉన్న విద్యుత్ తీగ తగిలి మతి చెందింది. శనివారం ఉదయం కంబాలపాడు చెందిన గొర్రెల కాపరి జీవాలు మేపుకుంటూ తన కుక్కతో అటుగా వెళ్ళాడు. దూరంగా ఉన్న గేద కళాబరాన్ని పసి గట్టిన కుక్క అక్కడికి వెళ్లి దాన్ని మూతి వద్ద వాసన చూసి విద్యుత్ షాక్‌తో అక్కడే కూలిపోయింది. దూరం నుంచి గమనించిన పశువుల కాపరి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. వారు విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అప్పటికి ఒక రోజు ముందే గేదె మృతి చెంది ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతూ ఉండడం కనిపించింది. అక్కడ మృతి చెందిన గేదె నందిపాలెం రైతు వెంకటేశ్వర రెడ్డికి చెందినది. లైన్‌మెన్ మృతి చెందినా పర్యవేక్షణ లేని అధికారుల నిర్లక్ష్యంతో సుమారు లక్ష రూపాయలు విలువ చేసే మూగ జీవి బలైపోయింది. దాంతో పాటు గ్రామ సింహంగా విశ్వాసానికి ప్రత్యేకంగా నిలిచిన పశువుల కాపరి కుక్క కూడా విద్యుత్ షాక్ తో చనిపోవడం వా సిబ్బంది తీరుపై సర్వత్రా విమర్శలు అనిపిస్తున్నాయి. ప్రాణాలు పోతే గాని అధికారులు స్పందించరంటూ చెప్పడానికి ఇటీవల దర్శి బస్సు ప్రమాదంలో పొదిలి వాసులు మృతి ఒక నిదర్శనం.

హమాలీలకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్


మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

హమాలీ, ముఠా కార్మికులకు సమగ్రమైన చట్టం చెయ్యాలని, వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం రాము అధ్యక్షతన జరిగిన ముఠా కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలన్నారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాలు చేపట్టాలని కోరారు .అందులో భాగంగా ఈనెల 25 నుంచి ఆగస్టు రెండో తారీకు వరకు సమగ్ర చట్టం, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ చట్ట సాధన కోసం ఆగస్టు 2న విజయవాడలో సదస్సు జరుగుతుందని, ఈ సద స్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రానున్నటువంటి రోజుల్లో కలెక్టర్ కార్యాలయం అసెంబ్లీ ఎదుట నిరసనకైనా సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా గాంధీ విగ్రహాలకి వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు. సంతకాల సేకరణలో, దశలవారీగా జరిగే ఆందోళన కార్యక్రమాలలో జిల్లాలోని హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తంబి శ్రీనివాసులు, బసవ పున్నయ్య శ్యామ్, శ్రీను, కాసిం, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువలో మొసలి.!

- గాయపడి తప్పించుకున్న గేదె - భయాందోళన చెందుతున్న స్వర్ణ గ్రామస్తులు

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు మండలం, స్వర్ణ గ్రామంలో కొమ్మమూరు కెనాల్ (కష్ణ కాలువ)లో మొసలి సంచరిస్తుండటంతో నాలుగు రోజులుగా స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. స్వర్ణ గ్రామంలో హరిజనవాడకు చెందిన ఒక వ్యక్తి రోజువారీ మాదిరిగానే గేదెలను తీసుకొని హరిజనవాడ వెనుక వైపు ఉన్న కష్ణ కాలువలో గేదెలను దాటించే క్రమంలో ఓ గేదెను ముసలి ముందుకాళ్ళ పట్టుకొని లోపలికి లాగింది. ఈ క్రమంలో గేదె తప్పించుకుంది. అదే సమయంలో రెండోసారి కూడా వెనుక కాలును కూడా ముసలి పట్టుకోవడంతో రెండో సారి కూడా గేదె తప్పించుకొని ఒడ్డుకు చేరింది. దీంతో గేదెకు తీవ్ర రక్త స్రావం కావడంతో పశు వైద్యాధికారులు చికిత్స చేశారు.


స్వర్ణలోని కొమ్మమూరు కాలువ

కాలువలో మొసలి సంచరిస్తుందన్న సమాచారంతో ప్రజలు, సమీప కాలనీవాసులు అందోళన చెందుతున్నారు. ఆదివారం కాలువలో బట్టలు ఉతికేందుకు వెళ్ళిన మహిళలకు సైతం నీటిలో మొసలి దర్శనమివ్వటంతో గ్రామంలోకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు మొసలి సంచరిస్తున్న కాలువను పరిశీలించారు. కొమ్మమూరు కాలువలో ప్రస్తుతం నీరు ఉధతంగా ప్రవహిస్తుండటంతో నీటి ప్రవాహం తగ్గితే గానీ మొసలిని పట్టుకోవటం సాధ్యం కాదని అటవీ అధికారులు చెప్పినట్లు స్థానికులు తెలిపారు. అప్పటివరకు కాలువలోకి దిగవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కార్యదర్శి ఎం శ్రీనివాసరావు

స్వర్ణ గ్రామంలో ప్రవహిస్తున్న కాలువలో ముసలి సంచరిస్తుందన్న సమాచారంతో ప్రజలెవరూ కాలువలోకి వెళ్లవద్దని పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు సూచించారు. ముసలిని పట్టుకొనేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

'రాజధానిలో ఒక్కడు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు

చిన్మయి క్రియేషన్స్ పతాకంపై నూతన చలనచిత్రం 'రాజధానిలో ఒక్కడు' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, సినీనటులు హాజరై చిత్ర బందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు సుభాష్‌బాబు మాట్లాడుతూ ఆగస్టు నెలలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రంలో మోహన్ బాబు, బాబుమోహన్, గీతా సింగ్, బ్రహ్మానందం, పోసాని కష్ణమురళి తదితరులు నటిస్తారని తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాత భూమిరెడ్డి రవణమ్మ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం సుభాష్‌బాబు వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వేమూరు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ


మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి-వేమూరు, బాపట్ల జిల్లా

వేమూరు నియోజకవర్గ అభివద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం వేమూరు నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వేమూరు నియోజకవర్గ స్థాయి అభివద్ధి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని మంత్రి చెప్పారు. రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గ పరిధిలోని పంచాయతీ రాజ్, ఆర్.బి పరిధిలోని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులకు చెప్పారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు సెప్టెంబర్15నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, బుడా ఛైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, సి.పి.ఓ భరత్ కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్,డి.ఎస్.ఓ విలియమ్స్ పాల్గొన్నారు.

లోకేష్‌కు నీరాజనం


బహిరంగ సభలో మాట్లాడుతున్న బిఎన్.విజయ్‌కుమార్


మాట్లాడుతున్న నారా లోకేష్

- చీమకుర్తిలో బహిరంగసభకు వర్షంలోనూ భారీగా హాజరైన జనం
- హారతి పట్టిన మహిళలు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తిలో వర్షంలో కూడా నారా లోకేష్‌కు ప్రజలు నీరాజనం పట్టారు. సోమవారం సాయంత్రం 4.30 సమయంలో స్థానిక పడమర బైపాస్ రోడ్డు సెంటర్ నుంచి లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. భారీ బాణాసంచా, డప్పుల మోతలతో ప్రధానవీధి గుండా పాదయాత్ర ప్రారంభమైంది. లోకేష్‌ను చూడడానికి టిడిపి కార్యకర్తలు, అభిమానులు రోడ్డు కిరువైపులా కిక్కిరిశారు. మహిళలు మిద్దెలపై నుంచి పూల వర్షం కురిపించారు. లోకేష్ ప్రజలకు అభివాదం చేస్తూ.. సెల్ఫీలు దిగుతూ ముందుకు సాగారు. మార్గమధ్యలో వివిధ రంగాల ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎన్ఎస్‌పి కాలనీ, ఇసుక వాగు సెంటర్, బస్టాండ్ సెంటర్, గాంధీనగర్ సెంటర్ మీదుగా సంతనూతలపాడుకు యాత్ర తరలిపోయింది. స్థానిక గాంధీనగర్ సెంటర్‌లో టిడిపి జిల్లా నాయకులు కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో భారీ గజమాలతో లోకేష్‌ను సత్కరించారు. నెహ్రూనగర్ సెంటర్‌లో చేనేతలతో లోకేష్ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దారిపొడవునా ప్రజలతో మమేకమై మాట్లాడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్‌విజయకుమార్, స్థానిక నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధరరావు, ఎన్ఆర్ఐ తక్కెళ్ళపాటి రమేష్, జి.రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


లోకేష్‌తో ఉమ్మడి జిల్లా టిడిపి నేతలు


చిన్నారితో లోకేష్


అభిమానితో సెల్ఫీ..



రైతులకు యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త శివ

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-దర్శి

బత్తాయితోటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాదించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శివ అన్నారు. సోమవారం ముండ్లమూరు, దర్శి మండలాల్లో బత్తాయితోటలు పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ బత్తాయితోటల్లో ఆకుముడత తెగులతోపాటు సన్నపురుగులు ఉన్నాయని వాటి నివారణకు రైతులు ట్రైకోడెర్మా, ఎంపార్టీపై మందులను 15 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడిఎ బాలాజీనాయక్

సాగుచేసిన పంటలకే ఈక్రాప్ చేయాలి

ప్రజాశక్తి-దర్శి

రైతులు సాగుచేసిన పంటలను మాత్రమే గ్రామంలో విఎఎలు ఈక్రాప్ చేయాలని ఎడిఎ బాలాజీ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఒ బాలకృష్ణ అధ్యక్షతన విఎఎలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, సిబ్బంది 2023 ఖరీఫ్ సీజన్లో ఈక్రాప్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రణాళిక తయారుచేసి ఖరీఫ్ పంటలకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈక్రాప్ నమోదు తప్పక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం నాగంబోట్లపాలెంకు చెందిన శనివరపు రమణారెడ్డి(38) విద్యుత్ షాక్‌తో సోమవారం మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం పనికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో ఉదయాన్నే పొలానికి వెళ్లి చూసేసరికి విద్యుత్ షాక్‌తో మృతిచెంది ఉన్నాడని బంధువులు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు, మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

30న మండల సమావేశం

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 30వ తేదిన దర్శి మండల సర్వసభ్యసమావేశం ఎంపిపి సుధారాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ కుసుమకుమారి తెలిపారు. కావున ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు అందరూ హాజరు కావాలన్నారు.

రిమ్స్ ఏవోగా ప్రకాశరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రిమ్స్ మెడికల్ కళాశాల పరిపాలన అధికారిగా పిసిపల్లికి చెందిన ప్రకాశరావు సోమవారం విధుల్లో చేరారు. ప్రకాశరావు నెల్లూరు జిల్లా మలేరియా కార్యాలయ పర్యవేక్షులుగా పని చేస్తూ పదోన్నతిపై ఒంగోలు రిమ్స్ కళాశాలకు వచ్చారు. ఆయన ఒంగోలు కళాశాలకు రావడంతో పలువురు అభినందనలు తెలియజేశారు.

మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మానవత్వాన్ని మంటగలిపేలా మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి సామూహిక అత్యాచారం చేయడాన్ని యావత్ భారతదేశం ఖండిస్తున్నదని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సంతనూతలపాడు మండల కార్యదర్శి ఎన్.మాలతి అన్నారు. మణిపూర్‌లో జరిగిన దారుణ ఘటనలను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక బీసీ కాలనీలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. బిజెపి పాలనలో దేశంలో మహిళల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందనేది ఈ ఘటనలు అద్దం పడుతున్నాయని, ఈ ఘటనకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై యావత్తు భారతదేశం ఒక తాటిపై నిలబడి ఇటువంటి అమానుషమైన ఘటనలను ఖండించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.బుజ్జి, టి. అంకమ్మ, కె.శేషమ్మ, కె.రేణుక, మహిళలు పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్ : మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, బాధితులకు సత్వర న్యాయం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ డిమాండ్ చేశారు. స్థానిక



నిరసన తెలియజేస్తున్న ఐద్వా సంఘం మహిళలు

హౌసింగ్ బోర్డులోని సంఘ కార్యాలయంలో సోమవారం నరసం ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనపై నిరసన కవితాగళాలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన మహిళలు, నరసం కవయిత్రులు నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టి.అరుణ మాట్లాడుతూ మణిపూర్ లో స్త్రీలపై జరిగిన అత్యాచారాలతో దేశమంతా సిగ్గుతో తలదించుకోవాల్సిన అంశమని, ఈ ఘటనతో దేశంలో అమ్మతనం, స్త్రీల ఆత్మగౌరవం బహిరంగంగా హత్యకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ స్త్రీలను ఈ విధంగా అవమానించటం దేశగౌరవాన్ని ప్రపంచ దేశాలముందు నగ్నంగా నిలబెట్టినట్లు ఉందన్నారు. నరసం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు వర్ణ దురహంకారాన్ని నిస్సిగ్గుగా బహిర్గతం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నరసం ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీమతి కత్తి కపావరం గారు మాట్లాడుతూ తెగలమధ్య తెలియజేస్తుందన్నారు. స్త్రీలపై అత్యాచారం దిశగా ప్రయాణించటం తీవ్రంగా గర్హించదగిన అంశమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కవయిత్రులు వారి కవితలతో తీవ్ర స్వరంతో స్పందించారు. సత్వర న్యాయ విచారణ జరిపించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తేళ్ళ అరుణ

జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో అత్యధిక మంది విద్యార్థులు కలిగిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల ఒకటి. ఇక్కడ 1200 మంది విద్యార్థులకు పైగా విద్యాభ్యాషం కొనసాగిస్తుంటారు. ప్రత్యేకత కలిగిన పాఠశాల కావడంతో విద్యార్థుల భవిష్యత్ కోసం రూ. 10 లక్షల వ్యయంతో గ్రంథాలయాన్ని స్థానిక కెనరా బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖరరెడ్డి మాట్లాడారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసమైన పుస్తకాలు ఎన్నో అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుని గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ అచ్యుతుని మురళీక్రిష్ణ చొరవతో కార్పొరేట్ రెస్పాన్స్‌బిలిటీ కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక సౌకర్యాలతో గ్రంథాలయం సమకూరిందని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ట్రైనీ ఎస్పీ అంకిత సురానా మహవీర్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ రకాల పోటీ పరీక్షల నిమిత్తం పాఠశాల గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని, తద్వారా ఉన్నతంగా ఎదగాలని స్ఫూర్తి సందేశం ఇచ్చారు. కెనరా



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి

బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీక్రిష్ణ మాట్లాడుతూ బ్రతుకునిచ్చి, మనలను తీర్చిదిద్ది, ఇంత చక్కటి జీవితాన్ని ప్రసాదించిన పాఠశాలకు ఏదో ఒక రూపంలో గురుదక్షిణగా ఈ విధంగా సహకారం అందించడం గర్వంగా ఉందన్నారు. ప్రతి ఊరిలో బడి ఎలాగుంటుందో... అలాగే ప్రతి బడిలో ఒక గ్రంథాలయం ఉండడం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఎంఇఓ శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుందురు శ్రీనివాసరెడ్డి, మార్కాపురం కెనరా బ్యాంక్ స్టాఫ్, శ్రీసాధన డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, జి.యల్.రమేష్, శివప్రసాద్, రత్నరాజు తదితర ఉపాధ్యాయుల, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లు ఖాళీ చేయడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-మార్కాపురం

భర్త చనిపోయాడని, ఖర్మ కాండలు చేసుకునేంత వరకు ఖాళీగా ఉన్న గదిలో ఉండొచ్చని అవకాశం ఇస్తే... ఏకులా వచ్చి... మేకులా తయారై... వరుసకు వదిన అయిన కెజియా ఆ ఇల్లు నాదంటూ ఖాళీ చేయడం లేదని పట్టణానికి చెందిన రామయ్య అనే బాధితుడు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చాడు. వివరాలు ఇలా... పట్టణానికి చెందిన కూరపాటి రామయ్యకే కాదు... వారి పెద్దలకు సొంత ఇల్లు లేదు. ఈ నేపథ్యంలో తన అత్తకు ప్రభుత్వం తరపున వచ్చిన స్థలంలో కట్టుకున్న ఇంటిని కూరపాటి రామయ్యకు వ్రాసి ఇచ్చింది. ఆయన ఆ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. రామయ్య అన్న చనిపోవడంతో ఎక్కడో ఉంటున్న వరసకు వదిన అయిన కెజియా ఖర్మ కాండలు పూర్తయ్యే వరకు ఆ ఇంటిలో ఉంటామని చెప్పగా రామయ్య అప్పట్లో అంగీకరించారు. ఖర్మ కాండల తంతు ముగిసినా ఆమె మాత్రం ఇల్లు ఖాళీ చేయడంలేదు. సంవత్సరాలుగా తిష్ట వేసింది. ఆ ఇంటికి సంబంధించిన విద్యుత్ మీటరు, ఇంటి పన్ను అన్నీ తన పేరుతో ఉన్నాయని రామయ్య అంటున్నాడు. తన ఇంటికి ఏకులా వచ్చి... మేకులా తయారైన కెజియాను ఖాళీ చేయించాలని అధికారులను వేడుకుంటున్నాడు.

నయీం అంటే అర్థం తెలుసా? ఉడుముల



సమావేశంలో మాట్లాడుతున్న ఉడుముల శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

నారా లోకేష్‌కు నయీం అంటే అర్థం తెలుసా అంటూ కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం యువగళం పాదయాత్ర సందరర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే, ఆయన కుటుంబసభ్యులపై చేసిన విమర్శలకు ఉడుముల ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యేను నయీం అంటూ విమర్శించిన పప్పు లోకేష్‌కు దాని అర్థం తెలుసా అంటూ ప్రశ్నించారు. తాము ఎవరి భూములు ఆక్రమించలేదని, ఎవరిదగ్గర ట్యాక్స్‌లు వసూలు చేయలేదన్నారు. రూ.50 కోట్లతో హస్పటల్ కట్టినామని ఆరోపించిన పప్పు బాబూ... రూ.10 కోట్లకు ఇస్తాను, మీరు కానీ, మీకు స్క్రిప్ట్ రాసిచ్చిన నాయకులు గానీ కొంటారా అంటూ అని ప్రశ్నించారు. నేను హస్పటల్ స్థలంకు తీసుకున్న స్థలం 1980లో గాంధీ అనే వ్యక్తికి రిజిష్టర్ ఉందనిఅతని వద్ద శ్రావణి వెంకటేశ్వర్లుఅనే వ్యక్తి 2013 రిజిస్టర్ చేయించుకున్నాడన్నారు. అప్పటికే భవనం కట్టి ఉన్న దానిని నేను 2015లో కొన్నట్లు తెలిపారు. 1978నుండి మా తండ్రి వెంకట రెడ్డి రాజకీయాలో ఉన్నారన్నారు. 1985 నుండి టిడిపిలో ఉన్నాం... అప్పుడు మాతండ్రి ఎమ్మెల్యేగా గెలిచారు. తరువాత నా భార్య ఎంపిపిగా పనిచేసిందన్నారు. కొనకనమిట్ల మండలంలో స్థానిక సంస్థలు, సహకార సంఘాలు అన్ని మా చేతుల్లో ఉంటూ ప్రజాసేవలోనే ఉన్నామన్నారు. కందుల నారాయణరెడ్డి మా కుటుంబం ఎదుగుదలను చూడలేకనే రాజకీయాలలో పప్పు అయిన లోకేష్ చేత ఆరోపణలు చేయించాడన్నారు. 40 ఏళ్ల పొదిలి ప్రజల కల సాగర్ మంచినీటి ప్రాజెక్టుకు తెస్తే పప్పు బాబు తాము అధికారంలోకి వస్తే నీళ్లు ఇస్తామనడం హస్యాస్పందంగా ఉందన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చేది లేదు...బాబు ముఖ్యమంత్రి అయ్యేది లేదు... ఇక మీరేం అభివృద్ధి చేస్తారంటూ ఏద్దేవా చేశారు. కందుల నారాయణ రెడ్డి అవినీతి అక్రమాలు ఎవరికితెలియందికావా అంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెకెమిట్ల ఎంపిపి మోరబోయిన మురళికృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల వైసిపికన్వీనర్ మోరా శంకర్ రెడ్డి, నాయకులు కామసాని వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఎస్టీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉప్పలపాడు ఎస్టీ కాలనీవాసులు సోమవారం అధికారులకు విన్నవించారు. మండలంలోని ఉప్పలపాడు ఎస్టి కాలనీలో తాగునీరు, విద్యుత్ సమస్యలు నెలకొని ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ బి జేసురత్నం, ఎస్ శ్రీను, ఎస్ పుల్లమ్మ, సంతోషలక్ష్మి, వై శిరీష తదితర 15 మంది కాలనీవాసుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా సచివాలయ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, తహాసిల్దార్ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులకు అందజేశారు.

పాలసీదారుల నగదును వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండలం క్రాప గ్రామంలో కొంతమంది పాలసీదారులు గతంలో పోస్ట్ ఆఫీస్‌లో పనిచేసిన శరత్‌కు రూ.30 లక్షలు పైగా కట్టడం జరిగింది. ఈ 30 లక్షలు తీసుకొని శరత్ పరారయ్యాడు. అతనిని పట్టుకుని పాలసీదారులు అడగ్గా స్టాంపులు ముద్రణ ఉన్న బిల్లులు మాత్రమే తన బాధ్యత అని మిగిలినవి తనకు సంబంధం లేదని అన్నాడు. దీంతో శరత్‌కి పాలసీదారులకు మధ్య వాదోపవాదాలు జరగడంతో పోస్టల్‌పై అధికారులు వచ్చి కేసులు, గొడవలు వద్దని మీ డబ్బులు మా బాధ్యతని చెప్పడంతో పాలసీదారులు ఒప్పుకున్నారు అనుకున్న విధంగా శరత్ పోస్టల్ జిల్లా అధికారైన నూకరాజుకు కొంతమంది పాలసీదారులు సమక్షంలో డబ్బులు



తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న పాలసీదారులు

అందించారు. కొంతకాలం తరువాత నూకరాజును పాలసీదారులు అడగ్గా ఆయన సరైన సమాధానం చెప్పకుండా వారాలు నెలలు గడుపుతూ తెనాలి, బాపట్ల, విజయవాడ హెడ్ పోస్ట్ ఆఫీస్‌కి రమ్మని ఎలాంటి సమాధానం ఇవ్వడంలేదు. ఫోన్ చేస్తే తీయకపోవడంతో విరక్తి చెందిన పాలసీదారులు ఈ నెల 19వ తారీఖున కొల్లూరు హెడ్ పోస్ట్ ఆఫీస్‌ను ముట్టడించారు. కొల్లూరు హెడ్ పోస్ట్ ఆఫీసర్ స్పందించి నూకరాజుతో ఫోన్లో మాట్లాడి నూకరాజు ఈనెల 25 తారీఖున 50 వేలు లోపు గల అమౌంట్ ఇస్తానని మిగిలినవి ఈ నెల 31 లోపు అందరికీ చెల్లిస్తానని కొల్లూరు ఎస్సై సమక్షంలో ఒప్పుకున్నాడు. ఫోన్ చేస్తుంటే సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన పాలసీదారులు సిపిఎం కొల్లూరు నాయకులు బొనిగల సుబ్బారావుని వెంటబెట్టుకుని కొల్లూరు తహశీల్దార్ శ్రీనివాసరావు, సివి వెంకటేశ్వర్లుకు, క్రాప హెడ్ పోస్ట్ మాస్టర్ మోహన్‌రావుకి స్పందన కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు.

8వ రౌండ్ పూర్తయిన అమ్మకాలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు బోర్డులో సోమవారం నాటికి అమ్మకాలు 8వ రౌండ్లు పూర్తి అయినట్లు వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు. ఇప్పటికి 11.36 మిలియన్ల పొగాకు అమ్మకాలు జరపగా సరాసరి ధర కిలో రూ.207.94 పలికిందన్నారు. ఇప్పటి వరకు బ్రైట్ రకం సరాసరి ధర కిలో రూ.210.25, మీడియం రకం సరాసరి ధర కిలో రూ.215.37, లో గ్రేడు సరాసరి ధర కిలో రూ.199.45 పలికిందన్నారు.

సోమవారం నాడు వేలం కేంద్రం వివరాలు: సోమవారం నాడు వేలం కేంద్రానికి చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 957 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 896 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 61 బేళ్లు వివిధ కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర రూ.250, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.238.18 పలికింది.

పొగాకును బోర్డులోనే అమ్ముకోవాలి

కొండపి : రైతులు తమ పొగాకును బోర్డులో అమ్ముకుని లబ్ధి పొందాలని కొండపి బోర్డు సభ్యులు బొద్దులూరి లక్ష్మీనరసింహం అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల మాట్లాడుతూ కొందరు రైతులు బోర్డు బయట అమ్ముకుంటున్నారని అది సరైన పద్ధతి కాదన్నారు. బోర్డులో ప్రస్తుతం అదనపు పొగాకు అమ్మకానికి ఎటువంటి రుసుము లేదని అన్నారు. బోర్డులో అత్యధిక ధర ప్రస్తుత తరుణంలో ఉందని ఆయన తెలిపారు. రైతులు తమ పొగాకు ఉత్పత్తులను బోర్డులోనే అమ్ముకోవటం ఎంతైనా శ్రేయస్కరమని తెలిపారు.

ఎఐఎం కన్వీనర్‌గా నత్తల క్రాంతి



క్రాంతికుమార్‌కు అభినందనలు తెలియజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-టంగుటూరు

అంబేద్కర్ ఇండియన్ మిషన్ (ఎఐఎం) రాష్ట్ర వ్యాప్త కమిటీల నియామకంలో భాగంగా కొండపి నియోజకవర్గ కన్వీనర్‌గా టంగుటూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన నత్తల క్రాంతి కుమార్, కో కన్వీనర్‌గా దండేల వినోద్ నియమితులయ్యారు. ఈ మేరకు వారు సోమవారం ఎయిమ్ ఇన్చార్జి స్టేట్ లీగల్ సలహాదారు, హైకోర్టు అడ్వకేట్ కరవది అనిల్‌ను కలిసి కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎయిమ్ కన్వీనర్ నత్తల క్రాంతి మాట్లాడుతూ మన సమస్యలను మనమే పరిష్కరించుకుంటూ మన ఓట్లతో మనమే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునేలా ప్రజలను చైతన్య పరచనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎయిమ్ కమిటీ సభ్యులుగా నియమితులైన నత్తల క్రాంతి, దండేల వినోద్ తదితరులను స్థానికులు, పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు.

టిడ్కో గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలి : సిపిఐ

ప్రజాశక్తి-రేపల్లె :

టిడ్కో గృహాల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని టిడ్కో గృహాల సాధన కమిటీ నాయకులు పి.నాగాంజనేయులు, గొట్టుముక్కల బాలాజీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలో గత 5 సంవత్సరాలుగా నిలిచిపోయిన టిడ్కో గృహాల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు గృహాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ టిడ్కో గృహాల సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు, బాలాజీలు మాట్లాడుతూ సొంత ఇంటి కల నెరవేరుతుందన్న ఆశతో టిడ్కో గృహాల కోసం అప్పులు చేసి వేలాది రూపాయలను డీడీల రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తే ఇల్లు రాకపోగా చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడంతో లబ్ధిదారులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం జోక్యం చేసుకొని టిడ్కో



నిరసన తెలియజేస్తున్న సిపిఐ నాయకులు

గృహాల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని లేకుంటే రానున్న రోజుల్లో దశల వారి ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు దాసరి సాంబశివరావు, కె. వెంకట సుబ్బారావు, కొడాలి సాంబశివరావు, శ్రీరావమ్మ, ముసలయ్య, చంద్రశేఖర్, డి. ప్రకాశరావు, తలశిల సత్యనారాయణ, ఎం. కోటేశ్వరి, విజయ, బొలిశెట్టి సత్యనారాయణ, వసంత తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల అక్రమ అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో జనసేన నాయకులు

ప్రజాశక్తి-రేపల్లె :

అమరావతి రాజధాని కోసం రైతులు ఇచ్చిన భూముల్లో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చిన ప్రాంతంలో గృహ నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ మాట్లాడుతూ కష్టాయపాలెంలో ముఖ్యమంత్రి శంకుస్థాపనలో పాల్గొనటం దుర్మార్గమని అన్నారు. కోర్ట్ కేసు పెండింగులో ఉండగా ప్రజలను గొర్రెలను చేస్తూ మభ్యపెట్టే విధంగా శంకుస్థాపన పనులు చెయ్యటం దారుణమైన మోసం అన్నారు. ఈ పరిణామాలను తీవ్రంగా ఖండిస్తూ జనసేన పార్టీ నిరసన కార్యక్రమం చేపట్టిందన్నారు. శాంతియుత నిరసన కార్యక్రమాన్ని అణగదొక్కడానికి రేపల్లె నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులను ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకూ అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. అరెస్టు అయిన వారిలో రేపల్లె మండల అధ్యక్షులు జానకయ్య, పట్టణ జనసేన నాయకులైన బత్తుల మల్లి, పరిశా పవన్ కళ్యాణ్, దేవగిరి శంకర్, తోట వెంకట్, చందు ఉన్నారు.

జనసందోహాన్ని చూసి... వైసిపికి దిమ్మ తిరిగింది

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన లోకేష్ పాదయాత్ర, పొదిలిలో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన జనసందోహాన్ని చూసి... వైసిపికి దిమ్మతిరిగిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్ర ఎలా జరిగిందో ప్రజలకు తెలుసునన్నారు. సోమవారం స్థానిక జవహర్‌నగర్‌లోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందుల నారాయణరెడ్డి మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అనడంలో వైసిపి నేతల భయాన్ని ఎత్తి చూపుతోందన్నారు. మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు తన గురించి తెలుసునన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారి గురించీ తెలుసునన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా సాధన, పొదిలి మండలంతో సహా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తన ముందున్న



సమావేశంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

లక్ష్యమని కందుల అన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, మార్కాపురం, తర్లుపాడు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి, ఉడుముల చిన్నపరెడ్డి, కౌన్సిలర్ నాలికొండయ్య, టిడిపి నాయకులు నారు వెంకటేశ్వర్‌రెడ్డి, మాకం అబ్రహం పాల్గొన్నారు.



వాటర్‌క్యాన్లను పంపిణీ చేస్తున్న సిడిపిఒ, క్లబ్ సభ్యులు

వాటర్ క్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి వేటపాలెం

వేటపాలెం సెక్టార్ పరిధిలో గల 21 అంగన్వాడీ కేంద్రాలకు వేటపాలెం రోటరీక్లబ్ వారు వాటర్ క్యాన్లను అందజేశారు. మండల కేంద్రమైన స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో సోమవారం సాయంత్రం నిర్వహించిన క్యాన్‌ల బహూకరణ కార్యక్రమంలో అడిషనల్ సిడిపిఒ ఎం.సుచిత్ర మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను గుర్తించి వాటర్ క్యాన్లను బహూకరించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో వేటపాలెం మండల పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాలన్నిటికీ వాటర్ క్యాన్లు ఇవ్వాలని కోరారు. రోటరీ సభ్యులు డాక్టర్ కారంచేటి శివరామకష్ణ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సట్టా పుష్పవల్లి, రోటరీ అధ్యక్షులు బట్ట మోహన్‌రావు, కార్యదర్శి ఎవి.సురేష్, రోటరీ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి సీతారాం, సభ్యులు డాక్టర్ దివి పవన్, ఖదీర్ భాష, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్టిఫికేట్లు అందజేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ గుప్తా

ప్రజలకు జగనన్న సురక్ష సేవలు

ప్రజాశక్తి-రేపల్లె

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే సేవలు అందించటం జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమగుంట్ల కాశీ విశ్వనాథగుప్తా అన్నారు. పట్టణంలోని నేతాజీ నగర్లో సోమవారం జగనన్న సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంతో 11 రకాల సర్టిఫికెట్లతో పాటు అర్హత ఉండి పథకాలు పొందలేని వారిని గుర్తించి వాటిని దరికి చేర్చటం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్జులకు అడంగల్, 1బి, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్, కులం, ఆదాయం, ఆధార్ సేవలు అందించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కట్టా మంగా, కమీషనర్ విజయసారధి, కౌన్సిలర్ బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి అద్దంకి

తెలుగుదేశం రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు దూండి రాకేష్ కు అద్దంకి పట్టణానికి చెందిన తెలుగుదేశం నాయకుడు చిన్ని హనుమ మరియు కార్యకర్తలు సోమవారం ఒంగోలు పట్టణంలోని చెక్క వారి వసతీగృహంలో రాకేష్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి పూలమాలలు అందించి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హనుమ మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని టిడిపిలో అత్యున్నత పదవులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్ని ప్రసాద్, వాసు, అరవపల్లి ఆంజనేయులు, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ - పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ విద్యను రాష్ట్ర ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిహెచ్ వినోద్ మాట్లాడుతూ అమ్మఒడి పథకాన్ని అర్హులైన, చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి ఇవ్వాలని, కళాశాలకు అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పేద ప్రజలకు విద్యను దూరం చేసే విధానాన్ని ఖండించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య మాట్లాడుతూ... ఇంటర్మీడియట్ విద్యా సంస్థల్లో పాఠాలు బోధించడానికి టీచర్లు లేరని, విద్యార్థులు పరీక్ష తప్పటానికి ప్రభు త్వమే కారణమన్నారు. కార్యక్రమానికి గిరిజన సంఘం నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్, నగర అధ్యక్ష కార్యదర్శులు శశాంత్, హేమంత్, నాయకులు వెంకటేష్, వీరాస్వామి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

త్వరలో డయల్ యువర్ ఎమ్మెల్యే

- తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా..
- త్వరలో 28 వేల మందికి ఇళ్లపట్టాలు: బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ఎన్నో దశాబ్దాలుగా నెలకొని ఉన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. త్వరలోనే సత్యకేబుల్, వి కేబుల్ ద్వారా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని 33, 34, 35, 36 డివిజన్లలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పలు రకాలైన ధృవీకరణ పత్రాలను అధికారులు ఎమ్మెల్యే ద్వారా అందజేశారు. బాలినేని మాట్లాడుతూ ఒంగోలు నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, అందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి దాదాపు రూ.370 కోట్లకు పైనే నిధులను తీసుకు వచ్చానని, శాశ్వతంగా తాగునీటి సమస్యను తీరుస్తున్నట్లు తెలిపారు. దాదాపు 28వేల మందికి త్వరలో పట్టాలు అందజేస్తామని చెప్పారు. ఇటీవల పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై నిందలు వేశారని, అది మంచిది కాదని బాలినేని ఖండించారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ప్రతి 15 రోజులకు ఒకసారి డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వెలనాటి మాధవరావు, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంతకుమారి, 35వ డివిజన్ కార్పొరేటర్ శాండిల్య, 36వ డివిజన్ కార్పొరేటర్ ఢాకా సుజాత, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి విజయబాస్కర్‌రెడ్డి, ఢాకా హనుమారెడ్డి, కటారి శంకర్, తోటపల్లి సోమశేఖర్, గంటా రాము, తదితరులు పాల్గొన్నారు. అన్నీ డివిజన్లలో నిర్వహించిన సభల్లో ప్రజలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల అమెరికా పర్యటన ముగించుకొని సోమవారం ఒంగోలు వచ్చిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఒంగోలు రైల్వే స్టేషన్‌లో సోమవారం వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు.



మాట్లాడుతున్న బాలినేని

అర్జీలు పునరావృతమైతే ఉపేక్షించం: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందనలోనూ, జగనన్నకు చెబుదాంలో నమోదైన అర్జీలు పునరావతమైతే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో కలెక్టరు అధ్యక్షతన సోమవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతిపత్రాల ద్వారా తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించుకున్నారు. స్పందనలో వచ్చిన 81 అర్జీలను కలెక్టరు పరిశీలించి తక్షణమే పరిష్కారమార్గం చూపారు. మరికొన్నింటిని సంబంధిత శాఖల అధికారులు విచారించాలని ఆయన ఆదేశించారు. గ్రీన్ బాపట్ల పేరుతో ఈనెల 28వ తేదీన జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మొక్కలు నాటాలని కలెక్టరు రంజిత్ బాషా చెప్పారు. జిల్లాస్థాయి కార్యక్రమం బాపట్ల మండలం వెదుళ్లపల్లిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగానే డి.ఆర్.డి.ఏ ద్వారా ప్రతి మండలానికి అదనంగా వెయ్యి చొప్పున కూరగాయల విత్తనాలను ప్రత్యేకంగా మహిళలకు పంపిణీ చేస్తామన్నారు. “ఆడుదాం ఆంధ్ర” కార్యక్రమాలు ఆగష్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలలో చేపట్టేందుకు అధికారులు సంసిద్ధం కావాలన్నారు. సీఫుడ్ ఫెస్టివల్ ఈనెల 28, 29, 30 తేదీలలో విజయవాడలో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను కలెక్టరు విడుదల చేశారు. జిల్లాలోనూ సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్. శ్రీధర్, డి.ఆర్.ఓ కె. లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.


కలెక్టర్ రంజిత్‌బాషా

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-మద్దిపాడు

స్పందనకు వచ్చే అర్జీల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు. సంత నూతలపాడు నియోజకవర్గ స్థాయి సప్పదన కార్యక్రమాన్ని మద్దిపాడు మండల పరిధిలోని వెల్లంపల్లి ఆవాస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించారు. మద్దిపాడు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన కామేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న భూరక్ష రీసర్వేలో తన భూమి 30 సెంట్లు తగ్గిందని, దాన్ని పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు. మల్లవరం గ్రామ రెవెన్యూ పరిధిలో చెంచురెడ్డికుంటకు పైనుంచి వచ్చే వరదనీరు దిగువ వెళ్లే మార్గం లేకపోవడం వల్ల సుమారుగా 100 ఎకరాలకు పైగా వరద నీటితో వ్యవసాయం చేసే పరిస్థితి లేదని రైతులు తెలిపారు. గుండ్లపల్లి ఎంపీటీసీ పల్లకి పద్మావతి మాట్లాడుతూ తమ గ్రామంలో రోజుకు అనేక పర్యాయాలు విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. ఒక జేఎల్ఎంతో సక్రమంగా పని చేయించుకోలేకపోయారా? అని విద్యుత్ ఏఈను కలెక్టర్ ప్రశ్నించారు. అతడిని రాజకీయ ఒత్తిడి వల్ల పారిశ్రామిక వాడలో వేయడం జరిగిందని ఏఈ తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమానికి 152 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వరకుమార్ పాల్గొన్నారు.


కలెక్టర్ దినేష్‌కుమార్

బాలినేనికి స్వాగతం పలికేందుకు

పోటీ పడి పరుగులు

కొండపి వైసీపీ నాయకుల పరిస్థితి

ప్రజాశక్తి-శింగరాయకొండ

మాజీమంత్రి, ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసులురెడ్డికి స్వాగతం పలికేందుకు కొండపి వైసిపి నాయకులు సోమవారం ఒంగోలుకు పోటీపడి పరుగులు తీశారు. బాలినేని ఇటీవల తానా సభలకు అమెరికా వెళ్లారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. కొన్ని రోజులు ఉండి సోమవారం రైలులో ఒంగోలుకు వచ్చారు. విషయం తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొండేపి నియోజకవర్గ స్థాయిలో ఉన్న వారంతా రైల్వేస్టేషన్ వైపు పరుగులు తీశారు. ఇప్పటికే సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు, వైసిపి రాష్ట్ర నాయకులు తాడిపర్తి చంద్రశేఖర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాదులోనే కలవటం జరిగింది. అక్కడికి వెళ్లని నాయకులు వారి అనుచరులతో సోమవారం జిల్లాలో రైల్వేస్టేషన్‌కి వెళ్లి స్వాగతం పలికారు. కొండేపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు అనుచరులుగా ఉన్న వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలోని నాయకులు మొత్తం కలిసి బాలినేనికి ఘన స్వాగతం పలికారు. తాజా మాజీ పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ఆధ్వర్యంలో భారీగా కదిలి వెళ్లి బాలినేనికి స్వాగతం పలికారు. టంగుటూరు చెందిన వైసిపి నాయకులు బొట్ల రామారావుతో పాటు జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి మండలాల నాయకులు కూడా కలిశారు. సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు అనుచరులుగా ఉన్న యువజన విభాగం అధ్యక్షులు శీలం రాము ఆధ్వర్యంలో కూడా వెళ్లి కలవటం జరిగింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు మొత్తం గ్రూపు గ్రూపులుగా వెళ్లి బాలినేనికి స్వాగతం పలకటం చర్చగా మారింది. ఇప్పటికే కొండేపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను నెల్లూరు, తాడేపల్లి పిలిచి సమావేశాలు ఏర్పాటు చేసి సమన్వయంతో పని చేయాలని ఓ పక్క హెచ్చరిస్తున్న నేపథ్యంలో బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లాకి వస్తున్న సందర్భంగా పోటీ పడి వెళ్లిన నాయకులు ఎవరిపాటికి వాళ్లు వెళ్లి ఒంగోలు రైల్వేస్టేషన్లో కలవటం, వారి నివాసంలో కలవటం జరిగింది. గత వారంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా ఉన్న డాక్టర్ మాదాసి వెంకయ్యను ఆ పదవి నుంచి తొలగించడం జరిగింది. అయితే డాక్టర్ మాదాసి వెంకయ్య పరిస్థితి ఏమిటనేది ఆయన గ్రూపులో చర్చగా మారింది.

పెదారికట్ల
'గడపగడపకూ..'లో

ఎమ్మెల్యేని నిలదీసిన మహిళలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని పెదారికట్లలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదివారం మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పెదారికట్ల వైసిపి గ్రూపునకు చెందిన కొందరు మహిళలు నిలదీశారు. నీకు ఓటు వేసినందుకు మమ్ములను అప్రతిష్టపాలు చేశావన్నారు. తమకు సంబంధించిన వాలంటీర్లను విధుల నుండి తొలగించటం మంచి పద్ధతేనా.? అని ప్రశ్నించారు. గ్రామంలో చోటామోటా నాయకుల మాటలు నమ్మి మమ్మల్ని భ్రష్టు పట్టించావని, ఇది మంచి పద్ధతి కాదని నిలదీశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మంచి పరిపాలన అందిస్తుంటే.. నీవు చిల్లర నాయకుల మాటలు విని పార్టీ మనుషులను దూరం చేయటం ఎంతవరకు సబబన్నారు. కేసులు నమోదు చేసిన తక్షణమే ఇరువర్గాలను పిలిచి న్యాయం చేసి ఉంటే బాగుండేదన్నారు. అనంతరం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. శాసన సభ్యులు మాట్లాడుతూ సమస్యలను తమ దష్టికి తీసుకువచ్చినట్లయితే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. సమస్యలను తెలుసుకునందుకే మీ వద్దకు వచ్చానని తెలిపారు. కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ మూరబోయిన మురళీకష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, వైకాపా మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద్దవెంకటరెడ్డి, రేగడిపల్లి సొసైటీ అధ్యక్షులు కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామనారాయణరెడ్డి, జిల్లా ఎస్సీసెల్‌స్టీరింగ్ కమిటీ సభ్యులు సిరుగురి కోటేశ్వరరావు, దివ్యాంగుల వైకాపా మండల అధ్యక్షులు నుసుం బాలచంద్రుడు, నాయకులు మూలే రాంబాబు, గంగవరపు ఓబుల్‌రెడ్డి, ఎదురు కొండారెడ్డి, కరేటి రామకోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గహ రథసారథులు తదితరులు పాల్గొన్నారు.